క్లుప్తంగా

ఫుడ్ ల్యాబ్ ప్రారంభం



ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి

గుత్తి: గుత్తిలోని కోట వీధిలో ఉన్న ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన ఫుడ్ ల్యాబ్‌ను డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫుడ్ ల్యాబ్ వల్ల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సొంతంగా ఎలా ఫుడ్ ఐటమ్స్‌ను తయ్యారు చేయవచ్చో తెలుసుకోవచ్చనన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వీరభద్రస్వామి

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు నెలసరి వేతనం కింద రూ.29,200 చెల్లించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీనియర్ నేత గోవిందు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని సీపీఐ నాయకులు సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. అరకొర వేతనాలతో కుటుంబపోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు సమాన పనికి సమానవేతనమివ్వాలన్నారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు గోపినాథ్, రాము, గౌస్ , నర్సయ్య, మహేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విలువలు పెంపొందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న వక్కల ఉమ

గుంతకల్లుటౌన్: చదువుతో పాటు మానవీయ విలువలు, సమాజసేవ విద్యార్థుల్లో పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే రోటరీ స్కూల్ ధ్యేయమని స్కూల్ కమిటీ నూతన చైర్మన్ శిరీష్, కరస్పాండెంట్ వక్కల ఉమ తెలిపారు. మంగళవారం స్కూల్‌లో పాఠశాల నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. విలువలతో కూడిన విద్య వ్యక్తిగత ఎదుగుదలకు, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా మారడానికి సహాయ పడుతుందన్నారు. రానున్న రోజుల్లో పాఠశాల సమగ్ర విద్యాభివృద్ధికి చేపట్టబోయే కార్యక్రమాల గురించి వారు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ మాధవీలత, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి సత్యనారాయణ, సుధీర్ కార్వా, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్'తో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న సీఐ

గుత్తి: పాలిటెక్నిక్ విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పాలిటెక్నిక్ విద్య ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని సీఐ రామసుబ్బయ్య అన్నారు. గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ఇన్స్పిరేషనల్ టాక్ సిరీష్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు బాగా కష్టపడి క్రమశిక్షణతో చదవాలన్నారు. చెడు వ్యసనాలు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. చదువే ముఖ్యమనే విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ప్రొఫెసర్ రామచంద్రయ్య, ఏఓ ఇంతియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓబులేసు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని టి.కొత్తపల్లికి చెందిన ఓబులేసు పని నిమిత్తం గుత్తికి వచ్చాడు. పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో తిరిగి గ్రామానికి వెళ్తుండగా కొత్తపేట గ్రామ శివారులో గుత్తి వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఓబులేసు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన జోష్

- గుంతకల్లు మున్సిపాలిటీ, పామిడి అనుబంధ కమిటీల నియామకం



గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు మున్సిపాలిటీ అనుబంధ సంఘాలను నియామిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ వింగ్ అధ్యక్షుడి డాక్టర్ మహేష్, అంగన్వాడీ వింగ్ అధ్యక్షురాలిగా అంజినమ్మ, మున్సిపాలిటీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, హరినాథ్‌రెడ్డి, బీసీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా బి.కె. రంగస్వామి, ఉపాధ్యక్షులుగా సి.రమేష్, కె.లోకేష్, బూత్ కమిటీ విభాగ అధ్యక్షుడిగా జేస్నే మస్తాన్, ఉపాధ్యక్షులుగా షేక్ నౌషద్, ఎగ్గుల నాగరాజు, క్రిస్టియన్ విభాగ అధ్యక్షుడిగా ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వీరరాజు, ఎ.మధు నియమితులయ్యారు. సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా చెన్నం ఎల్లప్ప, ఉపాధ్యక్షులుగా మోతి ఆంజినేయులు, ఎం.ఆంథోని, దివ్యాంగుల కమిటీ అధ్యక్షుడిగా షేక్ జిలాన్, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, సీహెచ్ సుదర్శన్‌బాబు, గ్రీవెన్స్ వింగ్ అధ్యక్షుడిగా హరి గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా షానవాజ్, సి.రమేష్, ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడిగా బి.మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా అనంతసేనరెడ్డి, హరినాథ్‌బాబు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా దాదాఖలందర్, ఉపాధ్యక్షులుగా రమేష్‌రెడ్డి, మహబుబ్‌బాషా, లీగల్ సెల్ అధ్యక్షుడిగా యూనస్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఆరీఫ్, అశ్వత్ నారాయణ, మహిళ విభాగం అధ్యక్షురాలుగా చెన్నమ్మ, ఉపాధ్యక్షురాలుగా ఉషారాణి, షామీమ్‌ను నియమించారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎం.ఎం. రహిమాన్, ఎ.ఎం.డి. మైనుద్దీన్, షేక్ దాదా ఖలందర్, ప్రచార కమిటీ వింగ్ రామ్‌మోహన్ రాయల్, ఉపాధ్యక్షులుగా షేక్ ఖాజా, షేక్ దాదాఖలందర్, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా కె.సుధీర్, ఉపాధ్యక్షులుగా కె.శివ, రవి, రైతు విభాగం కమిటీ అధ్యక్షుడిగా టి.జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యు.పెన్నయ్య, రంగరెడ్డి, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగా నల్లన్న, ఉపాధ్యక్షుడిగా బాగ్యరాజు, టి.రాజశేఖర్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా మద్దికెర ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా స్టీవెన్ శ్యామ్,షేక్ కొలిమి షర్షష్ వలి, ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షుడిగా ఎస్.వెంకటేష్ నాయక్, ఉపాధ్యక్షులుగా ఈశ్వర్‌నాయక్, వై.కృష్ణనాయక్‌ను నియమించారు. విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కురబ మణికంత, ఉపాధ్యక్షులుగా వీఎంఆర్ అశోక్, కె.శివకుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా రమణ, ఉపాధ్యక్షుడిగా సంతోష్, నాగరాజు, వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా టి.విష్ణు సాయి, ఉపాధ్యక్షులుగా డి.ఫిరోజ్, మద్దికెర రామ్‌మోహన్, చేనేత విభాగ కమిటీ అధ్యక్షుడిగా కె.నాగరాజు, ఉపాధ్యక్షులుగా కనిగిరి వెంకటేష్, కె.మురళి, యువజన విభాగం కమిటీ అధ్యక్షుడిగా బోయ మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా షేక్ మహమ్మద్ ఫయాజ్, వైస్సార్‌టీయూసీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా సి.రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా జయప్రకాష్ నాయక్, అబ్దుల్ రహిమాన్ నియమితులయ్యారు.

పామిడి మండలంలో..

పామిడి: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు నియోజకవర్గంలోని పామిడి నగర పంచాయతీ అనుబంధ కమిటీలను నియమించారు. పామిడి నగర పంచాయతీకి సంబంధించి డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఎస్ అబ్దుల్ మజీద్, పంచాయతీరాజ్ వింగ్ కమిటీ అధ్యక్షుడిగా సీ రజాక్‌వలి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం.మహేశ్వర్‌రెడ్డి, ఎస్.నూర్‌బాషా, బీసీ విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా చీమల నగేష్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం. నాగార్జున, బీ మస్తాన్, బూత్ విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా ఎల్. రామచంద్రారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా బి.సూర్యనారాయణ, జి. వెంకటేష్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం ప్రెసిడెంట్‌గా పి.అనిల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా వి.వీరయ్య, ఎం.కిష్టఫర్‌బాబు, కల్చరల్ వింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా ఎం.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా పి. ఆదినారాయణరెడ్డి, పి.అజిత్ కుమార్ నియమితులయ్యారు. దివ్యాంగుల విభాగం ప్రెసిడెంట్‌గా ఎస్.షెక్షావలి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.నిహాల్, వి.రాజు, గ్రీవెన్స్ విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా పి.యల్లప్ప, వైస్ ప్రెసిడెంట్లుగా కె.శివయ్య, పి.రాజేంద్ర, ఇంటలెక్చువల్స్ ఫోరం కమిటీ ప్రెసిడెంట్‌గా ఎన్. వెంకటగుప్తా, వైస్ ప్రెసిడెంట్లుగా ఆర్.ఎస్.సందీప్, ఎ.విఠల్ రావు, ఐటీ విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా ఎస్.దినేష్, వైస్ ప్రెసిడెంట్లుగా టి.అభిలాష్, టి.దాదాఖలంధర్, మహిళా విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా కుమ్మెత లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం.శ్యామల, వి. రజితను నియమించారు. మైనార్టీ విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా ఎస్.మహమ్మద్‌గౌస్, వైస్ ప్రెసిడెంట్లుగా మద్దికెర బాషా, కె. నూర్‌బాషా, ప్రచార విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా కె.సుధాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా వై.ధనుంజయ, కె.రాయణస్వామి; ఆర్టీఐ విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా ఎస్.అబుసాలేహా, వైస్ ప్రెసిడెంట్లుగా కె. మహబూబ్‌బాషా, మహమ్మద్ షరీఫ్, రైతు విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా ఎం.హెచ్.శంకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా సి.సూర్యనారాయణరెడ్డి, జి.కోనారెడ్డి, ఎస్టీ విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా చిన్నరాజు, వైస్ ప్రెసిడెంట్లుగా నాగరాజు, రామాంజనేయులు, విద్యార్థి విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా జిలాన్ బాషా, వైస్ ప్రెసిడెంట్లుగా ఆర్.రమేష్, ఎన్.రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. వాణిజ్య విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా బి.నారపరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా బి.జయకుమార్‌రెడ్డి, ఎల్.శ్రీకాంత్‌రెడ్డి, వలంటీర్ల విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా వి. నాగశివ, వైస్ ప్రెసిడెంట్లుగా సి.సురేష్, సి.రామ్మోహన్‌రెడ్డి, చేనేత విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా గడ్డం వెంకటేశులు, వైస్ ప్రెసిడెంట్లుగా ఎర్రజోడు ధనుంజయ, రంగం వెంకటేశులు, యువజన విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా పెద్దకాలువ వినోద్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎ.ఓబులేశు, షేక్ ఖాదీర్, ట్రేడ్ యూనియన్ కమిటీ ప్రెసిడెంట్‌గా ఎం.రామాంజనేయులు, వైస్ ప్రెసిడెంట్లుగా ఈ.నాగేంద్ర, వి.చంద్రశేఖర్ నియమితులయ్యారు.

27న వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవం

శింగనమల: బుక్కరాయసముద్రంలో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర -కోఆర్డినేటర్ సజ్జల రామక్రిష్టారెడ్డి, రీజనల్ కో-ఆర్డినేటర్ , ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు బి.నరేష్‌కుమార్ రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాలికలందరికీ హాస్టల్ లో సీటు ఇవ్వాలి



హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

గుత్తి: ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్లో దరఖాస్తు చేసుకున్న బాలికలందరికీ సీటు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ డిమాండ్ చేశారు. గుత్తిలోని హాస్టల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు.. ఎస్ఎఫ్ఐ నాయకులతో కలసి మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్టల్ సదుపాయం కల్పించకపోతే బాలికలు చదువు మానుకోవలసి వస్తుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విత్తనశుద్ధి చేయకుండా సాగు చేయొద్దు



దోసలుడికిలో మాట్లాడుతున్న అధికారులు

గుంతకల్లు రూరల్: విత్తన శుద్ధి చేయకుండా పంట సాగు చేయవద్దని, అలా చేస్తే ఘననీయంగా దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లీనా వసుంధర సూచించారు. మంగళవారం మండలంలోని దోసలుడుకి, సంగాల గ్రామాల్లో పర్యటించిన ఆమె సంబంధిత గ్రామాల రైతులతో రైతు సేవా కేంద్రాల్లో సమావేశం నిర్వహించారు. విత్తన వేరుశనగ కొనుగోలు చేసిన రైతులు ప్రతి ఒక్కరూ ఒక గ్రాము టెబ్యుకొనజోల్ లేదా 2 గ్రాముల మోనోకాబ్ +కార్బెండిజయ్ లేదా మాంకోజెబ్ + కార్బెండిజమ్ లేదా 10 గ్రాముల ట్రికోడెర్మా విరిడీతో కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మొవ్వకుళ్లు నివారణకు ఎకరాకు 400 గ్రాముల మోనోకాబ్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తామర పురుగు వ్యాప్తిని అరికట్టడానికి డైమిథోమెట్ 2 ఎంఎల్ మందును అర లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కౌలు రైతులు ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందే అవకాశం ఉందని, అందుకోసం రైతులు సీసీఆర్‌సీ కార్డులను సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శివరాజ్, ఎంపీఈఓ రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానంలో పూజలు



పూజలు చేస్తున్న నాగసాధువులు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉన్న హిందూ శ్మశాన వాటికలో మంగళవారం కాశీ నుంచి రప్పించిన నాగసాధువులతో ప్రత్యేక పూజలు చేయించారు. కొన్ని రోజులుగా శ్మశాన వాటికలో పునరుద్ధరణ పనులు సాగుతున్నాయి. భూమిలో నుంచి వచ్చిన అస్థికలకు పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతీదేవి సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



రాచేపల్లిలో దెబ్బతిన్న మోరీ

మోరీ మరమ్మతు చేయండి

శింగనమల: మండలంలోని రాచేపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలో మోరీ దెబ్బతినడంతో, వాహనాలు రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి వెళ్లే రహదారిలో మోరీ దెబ్బతిన్నదన్నారు. దీనివలన వాహనాలు వెళ్లలేకపోతున్నాయన్నారు. అధికారులు స్పందించి మోరీని మరమ్మత్తు చేయాలని కాలనీవాసులు కోరారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటండి



ఏపీఓ మద్దిలేటికి వినతిపత్రం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

యాడికి: రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలని రాయలచెరువు లయన్స్ క్లబ్ సభ్యులు కోరారు. మూడు నెలల క్రితం మండలంలోని రాయలచెరువు నుంచి దైవాలమడుగు వరకూ డబుల్ రోడ్డు వేశారు. కానీ అక్కడ రోడ్డుకు ఇరు వైపుల ఏ చెట్లు లేకుండా తొలగించారు. రాయలచెరువు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం, వాతావరణ కాలుష్యం తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ కొంత స్థాయిలో సహకరించాలనే లక్ష్యంతో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటితే.. వాటి సంరక్షణ బాధ్యత రాయలచెరువు లయన్స్ క్లబ్ సభ్యులు తీసుకుంటామని ఏపీఓ మద్దిలేటికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవికుమార్ రెడ్డి, ప్రసాద్, శేషానందరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో కంపచెట్లు, బండరాళ్ల తొలగింపు



బండరాళ్ల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ భూముల్లో మంగళవారం దాత సౌజన్యంతో కంపచెట్లు, బండరాళ్ల తొలగింపు పనులను చేపట్టారు. ఆలయ సమీపంలోని 183, 184 సర్వే నెంబర్లలో 5.75 ఎకరాల్లో దేవస్థానం భూమి ఉంది. ఇందులో 3 ఎకరాల్లో గోవుల కోసం పచ్చగడ్డి పెంచుతుండగా, మిగిలిన 2.75 ఎకరాల భూమి బండరాళ్లు, కంపచెట్లతో నిండి ఉంది. ఈ క్రమంలో చిత్తూరుకు చెందిన దాత వాసు సౌజన్యంతో రెండు జేసీబీల సహాయంతో కంపచెట్లు, బండరాళ్ల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ కే.వాణి, ఏఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పుట్లూరు: పాత్రికేయులపై దుర్భాషలాడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. వివరాలు.. మండలంలోని చింతకుంట కాలభైరవస్వామి ఆలయ అర్చకుడు సూర్యకుమార్‌మూర్తిపై దేవదాయ శాఖ ఈఓ మురళీ కృష్ణ దుర్భాషలాడిన ఆడియో వైరల్‌గా మారిన విషయం విదితమే. ఈ విషయాన్ని పలు పత్రికల్లో ఈ నెల 22న ప్రచురించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ చింతకుంట గ్రామానికి చెందిన ఇంద్రసేన పాత్రికేయులను దుర్భాషలాడాడు. అర్చకుల్లో ఉన్న విభేదాల కారణంగా పాత్రికేయులపై రెచ్చిపోయిన ఇంద్రసేన దుర్భాషలాడిన వీడియోను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఇంద్రసేనపై పుట్లూరు మండల విలేకర్లు సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట నరసింహలకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

త్రిపుల్ ఐటీకి ఎంపిక



లావణ్య యమున రంజిత్ శృతి

తాడిపత్రిరూరల్: మండలంలోని పెద్దపొలమడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారనిప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మంగళవారం తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో లావణ్య, యమున, రంజిత్, శృతి ప్రతిభ కనబరిచారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి రూరల్: పట్టణంలోని సంజీవనగర్‌లో మంగళవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 250 మంది మహిళలకు కుట్టు నేర్పించనున్నారు. శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

తేలుకాటుతో వ్యక్తికి అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో మంగళవారం కదిరప్ప అనే వ్యక్తికి తేలు కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కదిరప్ప తన ఇంటి సమీపంలో ఉన్న గుడిసె పైనున్న గడ్డిని తొలగిస్తున్నాడు. ఈ సమయంలో గడ్డిలో ఉన్న విషపూరితమైన ఎర్ర తేలు కుడి చేతి వేళ్లకు కాటువేసింది. కుటుంబసభ్యులకు అతడిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మన్యుసూక్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వాణి, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన పామిడి వీరా



మాజీ సీఎం జగన్‌తో మాట్లాడుతున్న పామిడి వీరా

పామిడి: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. పామిడిలో వైఎస్సార్‌సీపీ స్థితిగతులపై వీరాతో జగన్ సమీక్షించారు. కూటమి మోసపూరిత పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి, వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన వీరాకు సూచించారు.

28న కౌలు భూముల వేలం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరులో వెలసిన పప్పూరమ్మ దేవస్థానానికి సంబంధించిన 18.30 సెంట్లను ఈ నెల 28న కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.మూడు సంవత్సరాలకు సంబంధించి భూముల కౌలు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారురూ.1000 డిపాజిట్ చెల్లించాలన్నారు. అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో వేలం నిర్వహిస్తామన్నారు.

ట్రాలీ లేని ట్రాక్టర్..



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ట్రాక్టర్

పెద్దపప్పూరు: మండలంలోని చెత్తను సేకరించరించడానికి ప్రభుత్వం ట్రాక్టర్ మంజూరు చేసింది. అయితే ట్రాలీ మంజూరు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ట్రాక్టర్ షోరూంలో బొమ్మలా దర్శమిస్తోంది. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే మండలవాసులు 'కొత్త ట్రాక్టర్ భలే ఉంది. ట్రాలీ ఎక్కడ అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ శంకుంతల వద్ద సాక్షి ప్రస్తావించగా ప్రభుత్వం చెత్త సేకరణకోసం ట్రాక్టర్ మంజూరు చేసిందన్నారు. పంచాయతీకి వచ్చే నిధులతో ట్రాలీ కొనుకోలు చేసి ట్రాక్టర్‌ను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

పేరుకుపోయిన చెత్త



జంగాల కాలనీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

గుత్తి: గుత్తిలోని జంగాల కాలనీలో చెత్తాచెదారం గుట్టగా పేరుకుపోయింది. రెగ్యులర్‌గా చెత్తా చెదారాన్ని, అపరిశుభ్రతను మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తొలగించడం లేదు. దీంతో చెత్తా చెదారం పేరుకుపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే దోమలు విజృంభిస్తున్నాయి. చెత్త కుప్ప పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉంది. అధికారులు స్పందించి చెత్తను శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరారు.